క్లుప్తంగా

స్వాగత తోరణం ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చిత్తూరు అర్బన్: 'చిత్తూరు నగరపాలక సంస్థ మీకు స్వాగతం పలుకుతోంది' అంటూ ఏర్పాటు చేసిన ఆర్చ్ (స్వాగత తోరణం) ఆకట్టుకుంటోంది. నగర కమిషనర్ అరుణ సూచనల మేరకు, ఇంజినీరింగ్ అధికారులు చిత్తూరు–తిరుపతి మార్గంలో నగరపాలక సరిహద్దు వద్ద 'చిత్తూరు నగరపాలక సంస్థ – సుస్వాగతం, ధన్యవాదాలు' అని ఆర్చ్‌ని ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ పరిధిలో వెళ్లే ప్రధాన రహదారుల్లో నగర సరిహద్దుల వద్ద సుస్వాగతం ఆర్చీలను ఏర్పాటు చేయడానికి కమిషనర్ చర్యలు చేపట్టారు. చిత్తూరు –పుత్తూరు ప్రధాన రహదారిలో ఇప్పటికే ఆర్చ్ ఏర్పాటు చేయగా, తాజాగా తిరుపతి మార్గంలో ఏర్పాటు చేశారు.

అడ్మిషన్లు ప్రారంభం

పూతలపట్టు: మండలంలోని పేటమిట్టలో ఉన్న అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కోసం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పీఆర్‌ఓ బాబ్జీ ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పాస్/ఫెయిల్ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తున్నారు. మొదటి 3 నెలల్లో 7500/-, తదుపరి 21 నెలలు 11,453/- ఉపకారవేతనంగా అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం పర్మనెంట్ ఉద్యోగ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 29వతేదీ అడ్మిషన్ల చివరి తేది అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000024919, 9100477371ను సంప్రదించాలని కోరారు.

ఫిర్యాదులొస్తే ఊరుకోను



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతి

చిత్తూరు రూరల్: వైద్య సేవల్లో నిర్లక్ష్యంపై ఫిర్యాదులు వస్తే ఊరుకోనని, ప్రభుత్వ ఆశయం మేరకు ప్రజలకు సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతీ దేవి ఆదేశించారు. చిత్తూరు మండలం బీఎస్‌ఆర్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శని వారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. అనంతరం శెట్టిగారి పల్లెలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ అమలు తీరును గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి భాస్కర్ సిబ్బంది గీతా కుమారి, షబానా బేగం తదితరులు ఉన్నారు.

నేడు వెంగంపల్లెలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు

తవణంపల్లె: మండలంలోని వెంగంపల్లెలో దాతల సహకారంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఉదయం ప్రారంభించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణ దాత, అర్ధగిరి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ పెద్దపీట



సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కుమార్‌రాజా

బంగారుపాళెం: గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. మండల కేంద్రంలో శనివారం సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమాదేవి, జెడ్పీటీసీ సోమశేఖర్, ఉపసర్పంచ్ కామరాజు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ ఉషా, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పల్లె తలుపు తట్టి.. నాడి పట్టి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే వైద్యరంగానికి ప్రాధాన్యం పెరిగింది. ఆరోగ్యశ్రీ పథకానికి ఊపిరి వచ్చింది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చేసింది. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. అందులో భాగంగానే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తుండడంతో పల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- గ్రామాల్లోనే అందుబాటులో 67 రకాల మందులు
- రోగులకు తప్పిన తిప్పలు





ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి, ఇంటి వద్దే వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు కాణిపాకం పీహెచ్‌సీ ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో 10 సచివాలయాలు, కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలో 9 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 50 వేల మందికి పైగా ప్రజలు వైద్యసేవలు పొందుతున్నారు. ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్‌లో ఫ్యా మిలీ డాక్టర్ సేవలను పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించింది. ఏప్రిల్ 6న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారికంగా ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారు. అందులో భాగంగా ప్రతి పీహెచ్‌సీకి ప్రత్యేకంగా ఇద్దరు వైద్యులను నియమించారు. పీహెచ్‌సీ వైద్యులు వారికి కేటాయించిన గ్రామాలకు నెలకు రెండు సార్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నారు. ఉదయం ఓపీల అనంతరం మధ్యాహ్న సమయంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీద్వారా శస్త్ర చికిత్స చేసుకుని, ఇంట్లో ఉంటున్న వారి ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తున్నారు. అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు. వీరితో పాటు దీర్ఘకాలిక, సాధారణ రోగులను పరీక్షించి మందు లు అందజేస్తున్నారు. మంచానికే పరిమితమైన రో గులు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి, ఆరోగ్య సూచనలు, సలహాలు అందజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. దాదాపు 67 రకాల రోగాలకు సంబంధించిన మందులు అందజేస్తున్నారు.

దీర్ఘకాలిక రోగులకు ఉపశమనం

గతంలో బీపీ, షుగర్ తదితర వ్యాధులతో బాధ పడుతున్న రోగులు ప్రతి నెలా ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకునే వారు. మందుల కోసం వేలకు వేలు ఖర్చు చేసేవారు. ప్రస్తుతం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. దీంతో ఆస్పత్రులకు వెళ్లే బాధ తప్పడంతో పాటు మందులు కొనుగోలు భారంగా కూడా లేదని దీర్ఘకాలిక రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలల్లో వైద్యసేవలు పొందినవారు

సాధారణ వైద్యసేవలు	5,105
వైద్య పరీక్షలు	4,777
గర్భిణులు	359
బాలింతలు	115
కాలుకదపలేని రోగులు	40
టీబీ రోగులు	10
క్యాన్సర్ రోగులు	12
షుగర్ వ్యాధిగ్రస్తులు	1,489
బీపీ వ్యాధిగ్రస్తులు	1,702

ప్రజలకు అవగాహన

ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సూపర్‌వైజర్లు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించేలా ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

వైద్యులు ఇంటికే వస్తున్నారు



బీపీ, షుగర్‌తో బాధ పడుతున్నాను. గతంలో పరీక్షలు చేయించుకోవాలంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు అస్పత్రి వద్దే ఉండే పరిస్థితి. కానీ ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు ఇంటికే వస్తున్నారు. ఇంటి వద్దే డాక్టర్లు బీపీ, షుగర్ పరీక్షలు చేసి, ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకుని ఉచితంగా మందులిచ్చి వెళ్లారు.

– సులోచనమ్మ, చిన్న వెంకటపల్లె, ఐరాల

గాయం మానింది



దీర్ఘకాలంగా గాయంతో బాధపడుతున్నాను. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లినా, వేల రూపాయలు ఖర్చు పెట్టినా తగ్గలేదు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు ఇంటికి వచ్చి పరీక్షలు చేసి ఇంజక్షన్లు, అయింట్‌మెంట్లు ఇచ్చారు. ప్రతి నెలా వచ్చి పరీక్షలు చేసి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం గాయం మానుతోంది.

– కోదండరెడ్డి, వైఎస్ గేటు, ఐరాల

నాణ్యమైన వైద్యసేవలు



పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లను ప్రభుత్వం నియమించింది. నాతోపాటు మరొక డాక్టర్ పీహెచ్‌సీ పరిధిలో కేటాయించిన గ్రామాలకు వెళ్లి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమంతో గ్రామీణులకు ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి.

– ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, ఐరాల

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న విద్యాసాగర్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదానానికి బంగారుపాళెం మండలం సంక్రాంతిపల్లికి చెందిన విద్యాసాగర్ కుటుంబ సభ్యులు విరాళం అందజేశారు. ఈ మేరకు శనివారం వారు రూ.1,00,116 చెక్‌ను పర్యవేక్షకులు రంగస్వామికి అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. పర్యవేక్షకులు రంగస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష తల్లితో సమానం



ఎంఈఓను సన్మానించిన ఉపాధ్యాయులు

యాదమరి: మాతృ భాష ఏదైనా అది కన్నతల్లితో సమానమని ఎంఈవో ప్రసాద్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని శనివారం మండలంలోని దళవాయిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎంఈఓ మాట్లాడుతూ తెలుగుభాషకు గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు ఎంతో కృషిచేశారని తెలిపారు. ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీ కృష్ణ దేవరాయులు చెప్పారన్నారు. అనంతరం విద్యార్థులకు పద్యాలు, పాటలు, సామెతల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యం పిళ్లై, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



పుష్పలత సమస్యను వింటున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక 20వ డివిజన్ ఇరువారం, పోతంబట్టు, శూలమిట్ట, కాజూరు ప్రాంతాల్లో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే నివాసం నుంచి ఇరువారం వరకు నాయకులు ప్రేమ్, రిచర్డ్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోతంబట్టు ప్రభుత్వ పాఠశాలలోని 25 మంది పిల్లలకు నోట్‌పుస్తకాలు, ప్యాడ్‌లను అందజేశారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికులు ఆయనకు కొన్ని సమస్యలు విన్నవించుకున్నారు. తన కుమారుడు లిఖిత్‌కుమార్‌కు డయాలసిస్ పింఛన్ ఇప్పించాలని శూలమిట్టకు చెందిన పుష్పలత విన్నవించారు. తన ఇద్దరు పిల్లలు బుద్ధిమాంద్యంతో పుట్టారన్నారు. పెద్ద కొడుకు నేత్ర సమస్యతో బాధపడుతుండగా, అతనికి పింఛన్ వస్తోందని చెప్పారు. లిఖిత్‌కు పింఛన్‌తో పాటు కిడ్నీ మార్పిడికి సాయం అందించాలని కోరారు. ఆ ప్రాంతంలో కల్వర్టు నిర్మించి కొత్తగా రోడ్డు వేయాలని స్థానికులు కోరారు. సమస్యలను పరిష్కారించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. నేడు ఇరువారం కాలనీలో స్థానిక 20వ డివిజన్ ఇరువారం కాలనీలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, కో–ఆప్షన్ మెంబర్ కిరణ్, కార్పొరేటర్ చల్లాముత్తు, నాయకులు రాజా, బాలసుబ్రమణ్యంరెడ్డి, దయాళ్, రాజు, వినోద్, బాలరాజు, శరత్‌రెడ్డి, మహేష్‌బాబు, సతీష్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యం



ఇంటివద్దకు వెళ్లి వైద్యం అందజేస్తున్న డాక్టర్



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్యం అందజేస్తున్న వైద్యాధికారి

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దనే వైద్యం అందిస్తున్నట్లు గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సందీప్ అన్నారు. చెన్నసముద్రం గ్రామంలో గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం బీపీ, షుగర్ ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. 65 మంది రోగులకు పరీక్షలు చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఉన్న విద్యార్థులకు వైద్యసేవలను అందించారు. వైద్య సిబ్బంది చంద్రశేఖర్, తేజు, నిరోషా, నరసమ్మ, బాబు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



బిడ్డను చూపుతున్న 108 సిబ్బంది

గుడిపాల: మండలంలోని చీలాపల్లెకు చెందిన నిండు గర్భిణి రోజాకు శనివారం సాయంత్రం పురుటు నొప్పులు రావడంతో 108కి కాల్ చేశారు. 108 వాహనంలో రోజాను తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఆశావర్కర్ సుప్రియ 108 వాహనంలోనే ప్రసవం చేశారు. రోజా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. మూడేళ్ల క్రితం పెళ్లి జరిగిందని మొదటి కాన్పులో ఆడబిడ్డ జన్మనిచ్చిందని శనివారం రెండవ బిడ్డకు కాన్పులో మగబిడ్డకు జన్మనిచ్చినట్లు రోజా భర్త చరణ్‌కుమార్ తెలియజేశారు. అనంతరం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైతులకు గడ్డికోత యంత్రాల పంపిణీ



చింతలగుంటలో చాఫ్‌కట్టర్స్ పంపిణీ చేస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్: మండలంలోని తాళంబేడులో ఉన్న రైతులకు శనివారం పశుసంవర్ధకశాఖ అధికారులు గడ్డి కోత యంత్రాలు అందజేశారు. సర్పంచ్ అమరనాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఈ చాఫ్‌కటర్స్‌ను రైతులకు పంపిణీ చేశారు. చాప్‌కటర్ యూనిట్ ధర రూ.33,970 కాగా ప్రభుత్వం రాయితీ రూ.13,588 అందిస్తోందని పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి శివ రాజ్ అధికారులు తెలిపారు. మిగిలిన నగదు రూ.20,382 రైతులు భరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీతా, వెటర్నరీ అసిస్టెంట్ మునిక్రిష్ణ పాల్గొన్నారు. చింతలగుంట సచివాలయ పరిధిలో కూడా రైతులకు చాఫ్‌కట్టర్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, మదన్, సిబ్బంది సురేష్, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం గిరింపేటలోని సత్యసాయి సేవాసమితి నిలయంలో శనివారం మధుమేహం, బీపీ వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఓ ప్రైవేటు డయాబెటిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరానికి 49 మంది హాజరయ్యారు. వైద్యుల బృందం వారికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. నిర్వాహకులు మనోహర్, శివప్రకాష్, గజేంద్రరెడ్డి, దేవరాజు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్, చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలి



ఏఎస్‌ఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు

ఐరాల: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న టీడీపీ నాయకులు నారా లోకేష్‌తోపాటు చంద్రబాబునాయుడు, అచ్చెన్నాయుడుపై చర్యలు తీసుకోవాలని మండల వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల పాదయాత్రలో నారా లోకేష్ మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకూ ఏ కార్యకర్తపై ఎక్కువ కేసులు ఉంటాయో వారికి అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులు ఇస్తామని కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా హామీలు ఇచ్చి రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్నారన్నారు. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ యశ్వంత్, మండల కో కన్వీనర్ గుణ పాల్గొన్నారు.

28 నుంచి వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు

కార్వేటినగరం: టీటీడీ ఆధ్వర్యంలో వేణుగోపాల స్వామి తెప్పోత్సవాలు ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఆలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ అధికారి మాట్లాడుతూ 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

కార్యక్రమాలు ఇలా..

సోమవారం 9 గంటలకు కోదండరామ స్వామివారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 గంటలకు స్వామివారికి తిరువీధి ఉత్సవం ఉంటుందన్నారు. 29వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారికి వేదపండితులచే స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 గంటలకు వేణుగోపాలుని తిరువీధి ఉత్సవం, 30వ తేదీ బుధవారం 9గంటలకు స్నపన తిరుమంనజనం, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు.

ఉన్నత ఆశయంతో ముందుకు సాగాలి



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు ఉన్నత ఆశయంతో ముందుకు సాగాలని మదర్‌థెరిస్సా విద్యాసంస్థల చైర్మన్ రవీంద్రబాబు, డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకులు దయానందరెడ్డి అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో శనివారం విజయం డిగ్రీ కళాశాల 20వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అతిథులుగా పాల్గొన్న రవీంద్రబాబు మాట్లాడుతూ చదువుతో పాటు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. దయానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమకు లభించిన అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరాలని చెప్పారు. కళాశాల చైర్మన్ తేజోమూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఎదగాలంటే సానుకూల దృక్పథం, అంకితభావం, క్రమశిక్షణ, సమస్యలను అధిగమించే శక్తి ఉండాలని చెప్పారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చార్టర్డ్ అకౌంటెంట్ సురేష్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ శైలజా తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ పార్క్‌చేస్తే కుక్కేనట



ఇదిగో ఈ బోర్డు చూశారా....

ఇది చదివితే ఎవడికీ అక్కడ బండిని పార్కింగ్ చేయాలని అనిపించదు. ఇది చిత్తూరు నగరం గిరింపేటలోని ఓ షాపు ఎదుట దర్శనమిచ్చింది. ఆ దుకాణం ముందర అడ్డదిడ్డంగా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో వ్యాపారం జరగడం లేదు. దీంతో ఏం చేయాలో అర్థం కాక చివరికి దుకాణం ముందు ఈ బోర్డు పెట్టాడు. ఆ బోర్డుపై ఇక్కడ బండి పెట్టే వాడు కుక్క అని రాసి ఉంది. ఈ బోర్డు చూసినవాళ్లు బండి పార్క్ చేయకుండా అలా ఓ లుక్కేసి నవ్వుకుంటూ వెళుతున్నారు.

–చిత్తూరు రూరల్

OFF CAMPUS PLACEMENT DRIVE
Date : 29.08.2023 (Tuesday)
Tech Mahindra
Teleperformance
each interaction matters
Eligibility : Final year Batch 2022 -23, with any Degree
Experience : Fresher or Experienced.
Job Location : Hyderabad and Chennai
VIGNANASUDHA DEGREE & P.G.COLLEGE
CMT Road, Sharman School Back Side,
Kongareddy Palli, CHITTOOR - 9493 210 966